క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుహాసినిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. అదివారం మండల పరిధిలోని పిల్లుట్లలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆరోగ్యంపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైద్య శిబిరం ఏర్పాటుకు కృషి చేసిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు బండారు గంగాధర్‌ని ఈ సందర్భంగా అభినందించారు.

ఎల్లమ్మ జాతర ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించగా, సోమవారం అమ్మవారి ఆలయంలో అభిషేకం, పుట్టధ్వని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం ఎల్లమ్మ కల్యాణం, అమ్మవారికి డోనం సమర్పించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముగిసిన సోమేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు



స్వామి రథోత్సవం ఊరేగింపు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సోమేశ్వర బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శనివారం రాత్రి నిర్వహించిన స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. తిరొక్కపూలతో అలంకరించిన రథం రంగు రంగుల విద్యుత్ దీపాల మధ్య ముందుకు సాగింది. స్వామివారి రథానికి మంగళ హారతులు ఇచ్చి మహిళలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, జీవన్, ఎడ్ల కిష్టయ్య, రమేశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు



పోలీసులు పట్టుకున్న జేసీబీ

హవేళిఘణాపూర్(మెదక్): అనుమతుల్లేకుండా అక్రమంగా మట్టి తరలించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హవేళిఘణాపూర్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆదివారం తెల్లవారుజామున మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ చెరువులో నుంచి అక్రమంగా తరలిస్తుండగా, జేసీబీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరికైనా మట్టి అవసరం ఉన్నట్లయితే సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలని, అక్రమంగా మట్టి, ఇసుకను రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన



రోడ్లను పరిశీలిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూంల కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి, నాయకులు బాలాగౌడ్, ఉల్లెంగెల నరేశ్, బైరి నర్సింహులు, దక్కలి శ్రీను, కొరిమి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మార్కెట్ సముదాయం

ఆదాయం కోల్పోతున్న దుస్థితి



చేగుంటలో వృథాగా ఉన్న మార్కెట్ కమిటీ దుకాణ సముదాయం

చేగుంట(తూప్రాన్): మార్కెట్ కమిటీ దుకాణ సముదాయం ప్రారంభించి రెండేళ్లు దాటినా.. వాటిని అద్దెకు ఇవ్వక పోవడంతో ఆదాయం నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రం చేగుంటలోని మెదక్ రోడ్డులో అరవై లక్షల అంచనా వ్యయంతో మార్కెట్ కమిటీ దుకాణ సముదాయం నిర్మాణం చేపట్టి 2022లో ప్రారంభించారు. తొమ్మిది ప్రధాన రహదారి వైపు, మరో తొమ్మిది నిర్మాణాలు రోడ్డుకు వెనకవైపుకు ఉపయోగించుకోవడానికి అనుకూలంగా నిర్మించారు. 2022లో మార్కెట్ కమిటీ నిబంధనల ప్రకారం బహిరంగ వేలం పాట నిర్వహించగా, పలువురు చిరు వ్యాపారులు వేలం పాటలో దుకాణాలను దక్కించుకున్నా అద్దె ఎక్కువగా ఉండి 2 దుకాణాలు మాత్రమే అద్దెకు తీసుకున్నారు. మిగతా 16 దుకాణాలు అద్దెకు తీసుకోకపోవడంతో వృథాగా ఉన్నాయి. స్థానిక మార్కెట్ పరిస్థితిని బట్టి రహదారివైపు దుకాణాలకు వ్యాపారాల కోసం రూ. 3 వేల వరకు, వెనకవైపు దుకాణాలకు గోదాములుగా వాడుకోవడానికి రూ. 2వేల వరకు చెల్లించేందుకు చిరు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్ కమిటీ నిబంధనల పేరుతో అధిక అద్దె ఉండటంతో వాటిని అద్దెకు తీసుకునేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. దీంతో వృథాగా ఉన్న 16 దుకాణాలకు మార్కెట్ కమిటీ ప్రతీ నెల దాదాపు రూ.50 వేల ఆదాయం కోల్పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ రేటుకు ఆధారంగా దుకాణ సముదాయ గదులను అద్దెకు ఇచ్చి చిరు వ్యాపారులు నిరుద్యోగులకు సహకారం అందించాని స్థానికులు కోరుతున్నారు.

అద్దె తక్కువగా తీసుకోవాలి



మెదక్ రోడ్డులో వ్యాపారం తక్కువగా ఉంటుంది. అక్కడి వ్యాపారం ఆధారంగా తక్కువ రేటుకు దుకాణాలు కిరాయి ఇస్తే బాగుంటుంది. వ్యాపారానికి అనుకూల అద్దె తీసుకుంటే నిరుద్యోగ యువతతో పాటు చిరు వ్యాపారులు దుకాణాలను తీసుకునేందుకు ముందుకొస్తారు. మార్కెట్ కమిటీకి ఆదాయం వస్తుంది.

– సోమ సురేశ్, చేగుంట

దరఖాస్తు చేసుకోండి

దుకాణాలు అద్దెకు అవసరం ఉన్నవారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారాల ఆదేశాలతో అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. చిరు వ్యాపారులు నిరుద్యోగులు దుకాణాలకు ఎంత అద్దె చెల్లించి తీసుకోవాలనుకుంటున్నారో దరఖాస్తులో పేర్కొంటే అధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటాం.

– మధురిక చేగుంట మార్కెట్ కమిటీ కార్యదర్శి

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేట శివారులోని గురుపాదగుట్ట శివాలయ వార్షిక ఉత్సవాల సందర్భంగా భ్రమరాంభ మల్లికార్జున కల్యాణోత్సవం, ఎడ్లబండ్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ప్రదర్శన

గురుపాదగుట్ట శివాలయ ఉత్సవాల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తమ ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి, ఆలయం చుట్టూ డప్పుచప్పుళ్లు, యువకుల నృత్యాల మధ్య ఊరేగించారు. ఎస్ఐ.శంకర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు దాచ సంగమేశ్వర్, రాజేందర్‌గౌడ్, కందుకూరి రవీందర్, మహంకాళి కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, గంగారెడ్డి, సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.



గురుపాదగుట్ట ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన

విద్యార్థులు బాగా చదువుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

తూప్రాన్: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని గీతా స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి అనేది ప్రతీ విద్యార్థికి కీలక దశ అని, బాల్య స్మృతులన్నీ ఇక్కడే పురుడుపోసుకుంటాయని అన్నారు. చేడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఉజ్వల జీవితంవైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ పి.ఉష, ప్రిన్సిపాల్ సీ.హెచ్.వెంకట కృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నస్కల్ రోడ్డు పనులు పునః ప్రారంభం



నస్కల్ రోడ్డు పునః ప్రారంభిస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నుంచి నస్కల్, నందగోకుల్, చల్మెడ గ్రామాల మీదుగా 18 కిలోమీటర్ల రోడ్డు పనులు ఆదివారం మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్డుకు నిధులు లేక మరమ్మతులు ఆగిపోయాయన్నారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు రోడ్డుపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం సదర్ కాంట్రాక్టర్ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముత్యంరెడ్డి, మారుతీ, అమరసేన రెడ్డి, లింగంగౌడ్, వెంకట్‌గౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ: మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఆదివారం పట్టణంలోని ఐబీలో ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు గట్టయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ ఉద్యమాన్ని మరింత బలపర్చేందుకు యువతరాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా నూతన కమిటీలు వేశామన్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కోళ్ల శివ ఆదేశాలతో మెదక్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి మాదిగ ఉపాధ్యక్షుడు మాసాయిపేట పరమేశ్ మాదిగ ప్రధాన కార్యదర్శి మలిశెట్టి రవి మాదిగ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి అస్తగల్ల బాల్‌రాజ్, కొల్పుల రత్నయ్య, మెదక్ మండల నూతన ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్, యాదగిరి, ప్రధాన కార్యదర్శి తుడుం నర్సింలుతో పాటు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

తునికి నల్లపోచమ్మకు భక్తుల పూజలు



కొనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు



తునికి నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి గ్రామ సమీపంలోని నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్స్‌పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేశ్ నల్లపోచమ్మకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి ఒడి బియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో పాటు పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు.

కొనసాగుతున్న సికింద్లాపూర్ ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాల భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి, లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకోవడంతో పాటు ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైనున్న స్వామివారిని కాలినడకన వెళ్లి దర్శించుకున్నారు. లక్ష్మీనర్సింహస్వామికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్‌గుప్తా, ప్రధాన అర్చకుడు ధనుంజయ్ శర్మ, సిబ్బంది నర్సింహరెడ్డి, విద్యాకర్‌చారి, నరేష్ చారి, తదితరులు ఉన్నారు.

రేపు హుండీ లెక్కింపు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్కలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయ శర్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు భక్తుల సమక్షంలో 5 నెలలకు సంబంధించి హుండీని లెక్కిస్తామన్నారు.

గుండె ఆపరేషన్ల రిజిస్ట్రేషన్లకు ఆహ్వానం

కొండపాక(గజ్వేల్): కొండపాకలో నూతనంగా స్థాపించిన సత్యసాయి సంజీవనీ సెంటర్ ఫర్ హార్ట్ కేర్ రీసెర్చ్ సెంటర్లో చిన్న పిల్లలకు గుండె సంబంధిత చికిత్సల కోసం సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించినట్లు చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన పిల్లవాడి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితంగా గుండె సంబంధిత ఆపరేషన్లు చేస్తారన్నారు. పేషేంట్‌ను వారం రోజుల పాటు ఆసుపత్రిలో ఉంచి పరిశీలిస్తారని, వారితో తల్లిదండ్రులు కూడా ఉండటానికి వసతి కల్పిస్తారని చెప్పారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందినవారైనా సరే ఆపరేషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 98495 55560 నంబరును సంప్రదించవచ్చని చెప్పారు.

ప్రొఫెసర్‌కు అభినందన

కొండపాక(గజ్వేల్): ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియామకమైన ప్రొఫెసర్ ఖాసింను ఆదివారం దళిత సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకి చంద్రభాను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రభాను మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్‌గా దళిత వర్గానికి కట్టబెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. యూనివర్సిటీ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపుతూ విద్యార్థులకు దిక్సూచిగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు తదితరులున్నారు.

కుటుంబానికి సాయం

దుబ్బాకటౌన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాయపోల్ గ్రామస్తుడు బ్యాగరి రమేశ్ కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. 2007– 2008లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.41 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు వెంకటేశ్, స్వామి, కరుణాకర్, ఆంజనేయులు, మధుసూదన్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బూర్గుపల్లి బ్రిడ్జి



ప్రమాదకరంగా ఉన్న బూర్గుపల్లి వెళ్లే బ్రిడ్జి

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బోదన్–మెదక్ రోడ్డు నుంచి బూర్గుపల్లి గ్రామానికి వెళ్లే చెరువు అలుగు వద్ద బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. గతంలో నిర్మించిన బ్రిడ్జికి ఎలాంటి అడ్డులేకపోవడంతో మూలమలుపు వద్ద బూర్గుపల్లి వైపు నుంచి వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనాలు అందులో పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డంప్‌యార్డు వద్దంటూ రిలే దీక్షలు



నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్న జేఏసీ నాయకులు, మొబైల్ అసోసియేషన్ ప్రతినిధులు

నర్సాపూర్: డంప్‌యార్డు ఎత్తి వేయాలన్న డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 13వ రోజుకు చేరాయి. గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తి వేయాలన్న డిమాండ్‌తో నర్సాపూర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టి కొనసాగిస్తున్నారు. ఆదివారం జేఏసీ నాయకులు రాజేందర్, రమణరావు, రిజ్వాన్, సుబ్రమణ్యం, నవీన్‌లతో పాటు మొబైల్ షాప్స్ అసోసియేషన్ ప్రతినిధులు గోపి, జ్ఞానేశ్వర్, శ్రవన్, ప్రభు, శంకర్, ఫైజల్, ప్రవీణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. డంప్‌యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బ్లాస్టింగ్‌లపై గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న దొంతి, మల్లుపల్లి గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): అక్రమ బ్లాస్టింగ్‌లపై గ్రామస్తులు ఆందోళన చేపట్టిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని మల్లుపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 526లో ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద బండరాళ్లను నిషేధిత పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ చేస్తు రైతులకు ఇబ్బందుకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమికి సంబంధించి నకిలీ పట్టాలు సృష్టించి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు దొంతి, మల్లుపల్లి గ్రామస్తులు ఫణిశశాంక్‌శర్మ, భవనగారి శ్రీనివాస్, రాంచందర్‌నాయక్, భిక్షపతి, ప్రవీణ్, మహేశ్ ఆరోపించారు. బ్లాస్టింగ్ చేస్తున్న భూమికి పక్కనే శ్మశాన వాటిక, డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ రియల్ వ్యాపారులు అవేమి పట్టించుకోకుండా పెద్ద ఎత్తున బ్లాస్టింగ్ చేస్తుండడం వల్ల వాటికి నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయం గురించి రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. అక్రమ పనులు నిలిపివేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 2005–06 విద్య సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్నేహితులతో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు టీఎస్ ప్రభాకర్, రాంకిషన్, సురేందర్, చంద్రకళ, వెంకటేశం, షరీఫ్, శ్రీధర్‌రెడ్డి, పెంటయ్య, శ్రీశైలం, సురేష్‌లను విద్యార్థులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర నేత మల్లికార్జున్



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తయారు చేసిన కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజలపై 30 శాతం పన్నుల భారం వేసి నడ్డి విరుస్తుండగా, కార్పొరేట్ సంపన్నులపై 32 శాతంగా ఉండగా, కేంద్ర ప్రభుత్వం దానిని 22 శాతానికి కుదించిందని విమర్శించారు. ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పన చేసిందని, కార్మిక రంగానికి రూ.3,500 కోట్లు, ఉపాధి హామీ కార్మికులకు రూ.80 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని వాపోయారు. కార్పొరేట్ సంస్థలకు వేలకోట్ల రాయితీలు ఇచ్చారని మండిపడ్డారు. కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఈ ఉద్యమంలో కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆర్‌బీఎల్ యూనియన్–సీఐటీయూ ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.